ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 23-05-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ నగరంలోని బస్తీల్లో మెరుగైన సదుపాయాల కోసం సకాలంలో తగినన్ని నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కేంద్ర మంత్రి G కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

2. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 500 కోట్ల రూపాయాల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

3. హైదరాబాద్ లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో ముఖాముఖి చాలెంజ్ మొదటి రౌండ్ తర్వాత ఫైనల్ చేరిన 20 దేశాల పోటీదారులు ఈరోజు తుది ముఖాముఖి పోటీలో తలపడుతున్నారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే నాలుగు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

**<u>సీఎం-జహీరాబాద్</u>**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 500 కోట్ల రూపాయాల విలువైన అభివృద్ధి పనులకు CM రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహాతో కలిసి శంకుస్థాపన చేశారు. హుగ్గెల్లి చౌరస్తాలోని మహాత్మ బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి 65వ జాతీయ రహదారి నుంచి ఝరాసంగం నిమ్జ్ ప్రాజెక్టు వరకు 9.5 కిలోమీటర్ల మేర నిర్మించిన 4 లైన్ల రోడ్డు , మచ్నూర్ లో 11.8 ఎకరాల్లో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనంతో పాటు జహీరాబాద్ రైల్వే బ్రిడ్జి ప్రారంభించారు. దీంతో పాటు 250 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి , సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ బసవేశ్వరుడు సామాజిక న్యాయం కోసం కృషి చేసారని అన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తిగా తెలంగాణ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బసవేశ్వరుడు ఇచ్చిన సందేశం ఆధారంగా సామాజిక న్యాయం చేపట్టేందుకు కులగణన చేపట్టామన్నారు.
(పీటీసీ, సంగారెడ్డి)

**రేవంత్ రెడ్డి-అరెస్టులు-హరీశ్ రావు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జహీరాబాద్ పర్యటన సందర్భంగా రైతులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన జరిగిన ప్రతిసారీ ముందస్తు అరెస్టులు , నిర్బంధాలు ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మొన్న నాగర్‌కర్నూల్ పర్యటనలో చెంచు సోదరులను అక్రమంగా అరెస్టు చేశారని, నేడు జహీరాబాద్‌లో రైతులను , రైతు నాయకులను అదుపులోకి తీసుకున్నారని విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను , రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేశారు.
(పీఎన్)

**కిషన్ రెడ్డి-సికింద్రాబాద్:**

హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం , ముఖ్యంగా బస్తీలలో మెరుగైన సదుపాయాల కోసం GHMC, వాటర్ వర్క్స్ విభాగాలకు సకాలంలో తగినన్ని నిధులు విడుదల చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఈ రోజు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పర్యటించిన కేంద్ర మంత్రి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఖైరతాబాద్ శాసన సభ నియోజకవర్గంలోని బగ్గీ ఖానా బస్తీలో MP లాడ్స్ నిధులతో కొత్తగా చేపట్టిన కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. బస్తీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత BRS ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ బస్తీలలో పౌర సదుపాయాలను మెరుగుపరచటంలో పూర్తి నిర్లక్ష్యం చూపాయని విమర్శించారు. బస్తీల్లో పార్కులు , రహదారులు, తాగు నీటి సరఫరా , మురుగు నీటి నిర్వహణ నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆక్షేపించారు. బస్తీ రోడ్ల సుందరీకరణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.

(SoundByte- Kishan Reddy)

అనంతరం ముషీరాబాద్ నియోజక వర్గం గాంధీ నగర్ లో కూడా కిషన్ రెడ్డి పర్యటించారు.
(MSL)

**మంత్రి పొన్నం ప్రభాకర్ -కవిత లెటర్**

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు కుమార్తె ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ బీఆర్ఎస్ లో ఉన్న అంతర్గత సమస్యలు, ప్రజల అనుమానాలను స్పష్టంగా బయటపెట్టారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లో ఫిల్మ్ భవన్‌లో ఈ ఉదయం లోక్ సత్తా ఉద్యమ నాయకుడు నరేడ్ల శ్రీనివాస్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రజలకు బీఆర్ఎస్‌పై ఉన్న అనుమానాలు ఇప్పుడు కవిత లేఖ ద్వారా ధృవీకరించినట్టు అయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యం లేదని , పార్టీ కార్యకర్తలు , సీనియర్ నాయకులకు అవకాశాలు లేవంటూ కవిత లేవనెత్తిన అంశాలపై బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు, తారక రామారావు, హరీష్ రావు తగిన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.
(పీటీసీ, కరీంనగర్)

**మిస్ వరల్డ్:**

ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలలో ముఖాముఖి చాలెంజ్ మొదటి రౌండ్ తర్వాత 20 దేశాల ప్రతినిధులు ఫైనలిస్టులుగా నిలిచారు. సమాజానికి అవసరమైన వ్యక్తిగత , అంతర్జాతీయ అంశాలపై ఆకట్టుకునే ప్రసంగాలు, ప్రదర్శనలతో కూడిన ఈ పోటీలో 107 మంది పోటీదారులు పాల్గొన్నారని నిర్వాహకులు వెల్లడించారు. మొదటి రౌండ్ లో పోటీదారులు తమ

అర్థవంతమైన ఉద్దేశ్యాలను, లోతైన భావాలతో వ్యక్తం చేశారు. తెలివితేటలు, ధైర్యం, వాస్తవికత, వ్యక్తీకరణను అంచనావేసి ఈ 20 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. యూరోప్ ఖండం నుంచి స్పెయిన్ , వేల్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఐర్లాండ్ పోటీదారులు షార్ట్ లిస్టు కాగా, అమెరికా- కరేబియన్ నుంచి -బ్రెజిల్ , Suriname, Cayman Islands, గుయానా, ట్రినిడాడ్ & టొబాగో పోటీదారులు ఎంపికయ్యారు. ఇక ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, నమీబియా, సోమాలియా, ఉగాండా, జాంబియా పోటీదారులు , ఆసియా& ఓషియానియా నుంచి శ్రీలంక , థాయిలాండ్, తుర్కియే, లెబనాన్, జపాన్ దేశాల పోటీదారులు ఎంపికయ్యారు. వీరంతా తుది ముఖాముఖీ పోటీలో ఈరోజు తలపడుతున్నారు.

(MSL)

**<u>వనపర్తి-కలెక్టర్</u>**

వనపర్తి జిల్లాలో ప్రతి ఒక్కరు విధిగా ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఈరోజు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 5వ, 10వ వార్డులలో నివాస గృహాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. వ్యక్తిగత , సామూహిక పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈసందర్భంగా ప్రజలకు సూచించారు. నీటి నిల్వ వలన సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలకు అంగన్వాడీ , ఆశావర్కర్లు అవగాహన కల్పించాలన్నారు.

(పిటిసి, వనపర్తి)

**ఆపరేషన్ సిందూర్-కొత్తగూడెం**

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి చెందిన మాజీ సైనికుడు నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. భారత సైన్యం తలుచుకుంటే మూడు రోజుల్లో పాకిస్తాన్ లో ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించగలదని ఆకాశవాణి తో చెప్పారు.

(బైట్ మాజీ సైనికుడు నాగేశ్వర్ రావు)

PTC-B.KGM

**హుస్నాబాద్ -పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నిన్న రాత్రి కురిసిన వర్షంతో నీట మునిగిన ప్రాంతాలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఉదయం పరిశీలించారు. నాళాలు, కల్వర్టు లను పరిశీలించిన మంత్రి నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జాతీయ రహదారి అధికారులను , మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో వర్షం కురిసినప్పుడు ఇబ్బందులు రాకుండా ఉండడానికి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కంటాక్టర్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

(సిద్దిపేట జిల్లా పీటీసీ)

**నల్లగొండ- ఓవైసీ దిష్టిబొమ్మ దహనం**

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ దిష్టిబొమ్మను నల్లగొండ పట్టణంలోని స్థానిక పెద్దగడియారం చౌరస్తాలో బీజేపీ జిల్లా పార్టీ నాయకులు దహనం చేశారు. జిల్లా ఆధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ మొన్న నల్లగొండలో జరిగిన సభలో అసదుద్దీన్ వక్ఫ్ బిల్లుపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వక్స్ చట్టం సవరణ వ్యతిరేకిస్తూ అసదుద్దీన్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేద న్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించడానికి ఎంఐఎం ఇలాంటి సభలు నిర్వహిస్తోందని విమర్శించారు.

(పీటీసీ, నల్లగొండ)

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం వెల్లడించింది. ఈరోజు , రేపు ఉరుములు, ఈదురు గాలులతో వానలు కురిసే అవకాశం ఉందని ఆదిలాబాద్ , మంచిర్యాల, నిర్మల్,

నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ తదితర జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. వచ్చే మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

(డెస్క్)

**<u>ఆసిఫాబాద్ -ఆయిల్ ఫామ్ బైట్</u>**

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం ఆసిఫాబాద్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అబ్దుల్ నదీమ్ రైతులకు సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు తక్కువ పెట్టుబడితో కూడుకొని ఉంటుందని ఆకాశవాణికి తెలిపారు.

(బైట్ ... ఆసిఫాబాద్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అబ్దుల్ నదీమ్)

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

<u>యాదాద్రి భువనగిరి -కలెక్టర్</u>

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాలి మిషన్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ , సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం లోపల జాలి మిషన్ ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు అసౌకర్యం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

(పీటీసీ, యాదాద్రి)

**<u>సిరిసిల్ల- అధ్యాపక పోస్టులు</u>**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల తెలంగాణ గురుకుల పాఠశాల , కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ , బీఈడీ అర్హత కలిగిన వారు 5వ తరగతి నుంచి

ఇంటర్మీడియట్ వరకు బోధించేందుకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసు కోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8688912738, 9949757365 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.
(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**మహబూబ్ నగర్ -జవాను**

ఆపరేషన్ సిందూర్ లో పాల్గొని స్వస్థలానికి చేరుకున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన సైనికుడు షేక్ అజార్ కు ఈరోజు తెల్లవారుజామున పోలీసులు , బంధు మిత్రులు , అభిమానులు స్వాగతం పలికి సత్కరించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రం లోని ముస్తఫానగర్ కు చెందిన షేక్ అజార్ 2016 సంవత్సరంలో సైన్యంలో చేరి సేవలు అందిస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంత మైనందుకు భారతీయుడిగా గర్వ పడుతున్నానని ఆయన చెప్పారు.
(మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి.)

**నల్లగొండ జిల్లా –జనరల్ ఆసుపత్రి**

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సామాన్యులకు కూడా కార్పోరేట్ తరహా అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. పట్టణ పరిధిలోని చర్లపల్లికి చెందిన వజ్జ ఎర్రయ్యకు నిన్న జనరల్ ఆసుపత్రి ఎముకల విభాగం మోకాళ్ల చిప్పల మార్పిడి మొదటి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.
(పీటీసీ, నల్లగొండ)

**సిరిసిల్ల-పరీక్ష**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్లుండి గ్రామ పాలన అధికారి పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లుండి ఉదయం 10 గంటల 30

నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల వరకు  జరిగే పరీక్షల కోసం, గీత నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలోని అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

(పీటీసీ, సిరిసిల్ల)